క్లుప్తంగా

భజన పోటీలు ప్రారంభం

సామర్లకోట: వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం జిల్లా స్థాయి భజన పోటీలు జరిగాయి. స్వామివారి కల్యాణ ఉత్సవాలను పురస్కరించుకుని పోటీలు నిర్వహించారు. బుధవారం నుంచి ఈ నెల 24 వరకు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలను ఏర్పాటు చేసినట్టు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 22 భజన మండళ్ల పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. న్యాయనిర్ణేతలుగా పెండ్యాల నాగేశ్వరరావు, గుణ్ణం శారదాదేవి, అమలకంటి చంటిబాబు వ్యవహరించారు. ఈ నెల 24న విజేతలకు బహుమతులు అందజేస్తారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ కీలకం

సామర్లకోట: ఇంటర్మీడియెట్ విద్య ప్రతి విద్యార్థి జీవితంలో కీలక బాట వేస్తుందని ఎస్సై మౌనిక అన్నారు. స్థానిక సత్యనారాయణపురంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. చదువుపై శ్రద్ధగా దృష్టి పెట్టడం ద్వారా డాక్టరు, ఇంజినీరింగ్ వంటి కోర్సులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం బాలికలకు అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన శ్యామ్

కొత్తపల్లి: పిఠాపురం–ఉప్పాడ రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... కొత్తపల్లి గాజులదొడ్డికి చెందిన కోడిదాసుల శ్యామ్ పిఠాపురం నుంచి మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా ఉప్పాడకు చెందిన మైలపల్లి దుర్గ, ఎం.రాజు, ఓసుపల్లి నూకరాజు బైక్‌పై మద్యం షాపు వద్దకు వెళ్లి వస్తూ కొండెవరంలో శ్యామ్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్యామ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు యువకులు మద్యం తాగి అతి వేగంగా నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైర్‌పర్సన్ వార్డు పర్యటన


సమస్యలను ఆరా తీస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

సామర్లకోట: పట్టణంలోని 22వ వార్డు శెట్టిబలిజపేటలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కమిషనర్ జె.రామారావు బుధవారం పర్యటించారు. కౌన్సిల్ సమావేశాల్లో తమ వార్డు సమస్యలు పరిష్కరించడం లేదని తరచూ వార్డు కౌన్సిలర్ పితాని కృష్ణ ఫిర్యాదులు చేయడంతో, వారు ఈ వార్డులో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ వార్డు నుంచి 24వ వార్డుకు వచ్చే డ్రైనేజీ కల్వర్టుకు ప్రహరీ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని కౌన్సిలర్ చూపించారు. వార్డులో వర్షపు నీరు బయటకు పోయే మార్గం, విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్ల సమస్యలను వివరించారు. కల్వర్టుకు ప్రహరీ నిర్మించి, డ్రైన్‌లో పూడిక తీయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

వైభవంగా కుంతీమాధవస్వామి గ్రామోత్సవం


పిఠాపురంలో గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పిఠాపురం: ఆధ్యాత్మిక కేంద్రమైన పిఠాపురంలో పంచమాధవ క్షేత్రాల్లో ఒకటైన కుంతీమాధవస్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం శేష వాహనం, గరుడవాహనంపై స్వామివారి గ్రామోత్సవాలను నిర్వహించారు. ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం నిర్వహించే స్వామివారి రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎన్.శ్రీరాములు తెలిపారు.


నాడు అధ్వానంగా ఉన్న రోడ్డు


నేడు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు


గ్రామ సచివాలయం

ప్రగతి కాంతులు

- అభివృద్ధి బాటన అమీనాబాద్
- 90 శాతం పూర్తయిన రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైన్లు
- రూపురేఖలు మారుతున్న తీరప్రాంత గ్రామం
- వైఎస్సార్ సీపీతోనే సాధ్యమంటున్న గ్రామస్తులు
- రూ.2.80 కోట్లతో నిర్మాణ పనులు

కొత్తపల్లి: తీరప్రాంత గ్రామాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి బాట పట్టాయి. అమీనాబాద్ గ్రామంలో సుమారు రూ.2.80 కోట్లతో మౌలిక సదుపాయాలైన సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీటి సౌకర్యాలు పుష్కలంగా కల్పించారు. ఇప్పటివరకూ 90 శాతం పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు.

గతంలో ఏ గ్రామానికి వెళ్లినా పరిస్థితి అధ్వానంగా ఉండేది. టీడీపీ ప్రభుత్వ హయంలో చేయలేని అభివృద్ధిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసి చూపించారు. అభివృద్ధితో ప్రజల కష్టాలకు తెరపడనుంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండు గ్రామ సచివాలయాలకు సంబంధించి రూ.40 లక్షలు, గ్రామ పంచాయతీ రూ.20 లక్షలు, మండల పరిషత్ రూ.30 లక్షలు, జిల్లా పరిషత్ రూ.10 లక్షలు, ఓఎన్‌జీసీ రూ.10 లక్షలు, అరబిందో ఫౌండేషన్ రూ.20 లక్షలు, జల్‌జీవన్ మిషన్ రూ.1.18 కోట్ల నిధులతో పనులు 90 శాతం పూర్తి చేశారు. మరిన్ని నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే ప్రధాన రహదారుల్లో మురికినీటి సమస్యను నియంత్రించేందుకు సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే గ్రామం అభివృద్ధి చెందుతోందని ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


మురికినీరు పోయేందుకు ఏర్పాటు చేస్తున్న సీసీ తూరలు


నిర్మాణంలో ఉన్న సీసీ డ్రైన్

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి సాధ్యం



గ్రామాభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం. టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం మినహా అభివృద్ధి ఏమాత్రం జరగలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ రోడ్లు, ప్రధాన రహదారుల రూపురేఖలు మారిపోయాయి. గ్రామ పంచాయతీలో సుమారు రూ.2.80 కోట్లతో పనులు జరుగుతున్నాయి. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తున్నారు. ఇంకా ఎంపీ నిధులు రూ.5 లక్షలతో పనులు చేపట్టడం జరుగుతుంది. – నక్క మణికంఠబాబు, సర్పంచ్, అమీనాబాద్

ఇబ్బందులు తొలగాయి



గతంలో సరైన రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడేవాళ్లం. వర్షాకాలంలో మరీ తీవ్రంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మా గ్రామంలో రోడ్లు వేయడంతో కష్టాలు తీరాయి. వైఎస్సార్ సీపీ హయంలో గ్రామం బాగుపడింది. ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.
– బి.జగన్నాథం, అమీనాబాద్

అభివృద్ధి చేసి చూపించారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి చేసి చూపించారు. గత ప్రభుత్వాలు మాటలు చెప్పడమే తప్ప పనులు చేపట్టిన పాపాన పోలేదు. మా గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మేమంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతుగా ఉంటాం.
– ఎర్రిపల్లి రాజు, మత్స్యకారుడు, అమీనాబాద్

వైద్యం చేరువ చేసేందుకే ఆరోగ్య సురక్ష శిబిరాలు


గొల్లప్రోలులో వృద్ధుడికి ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత సూచించారు. గొల్లప్రోలులో నగర పంచాయతీలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీ గీత పరిశీలించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

శంఖవరం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి కోరారు. శంఖవరం అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి ఎన్నికల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అన్నవరం ఎస్సై కిషోర్ బాబు, పులి సుధాకర్, గునపర్తి అపురూప్, బత్తిన తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథులు వలంటీర్లు

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- గొల్లప్రోలు, కొత్తపల్లిలో వలంటీర్లకు సత్కారం


సేవారత్న అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం/కొత్తపల్లి: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ వలంటీర్ల సంక్షేమ సారథులని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లను శాలువా, పూలమాలలతో సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వలంటీర్ల పనితీరును చూసిన పలు రాష్ట్రాలు ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నాయన్నారు. వలంటీర్లను ప్రజలు తమ సొంత కుటుంబ సభ్యులుగా పరిగణిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు పేదలను దోచుకున్నాయని గుర్తు చేశారు. ఎల్లో మీడియా వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను తెలుసుకోవాలన్నారు. అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన సురేష్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, ఎంపీడీఓ వెంకట నారాయణ, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ రాష్ట్రానికే గర్వ కారణం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గ్రామ వలంటీర్ల వ్యవస్థ రాష్ట్రానికే గర్వ కారణమని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత అన్నారు. గొల్లప్రోలులో నగర పంచాయతీలో బుధవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ వంగా గీత ముఖ్య అతిథిగా పాల్గొని సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డు పొందిన వలంటీర్లను శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలులో నగర పంచాయతీ వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, కమిషనర్ టి.రవికుమార్, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో వలంటీర్లను సత్కరిస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత తదితరులు

పథకాల అమలులో వలంటీర్లే కీలకం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దొరబాబు
- సేవా పురస్కారాల ప్రదానం


వలంటీర్లను అవార్డులతో సత్కరించిన దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. పట్టణానికి చెందిన వలంటీర్లకు సేవా పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి దొరబాబు మాట్లాడుతూ వలంటీర్లు సేవా సైనికులని అభివర్ణించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను చేరవేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అందుకు తగ్గట్టుగానే వలంటీర్లు ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటికి అందిస్తూ, నిరంతర సైనికుల్లా పనిచేస్తున్నారని అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు అన్నారు. సంక్షేమ ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందజేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమైందన్నారు. అనంతరం సేవారత్న, వజ్ర సేవా పురస్కారాలతో వలంటీర్లను శాలువాలు, ప్రశంసాపత్రాలు, పతకాలతో దొరబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, కౌన్సిలర్లు ముప్పన శ్యామలాంబ, విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆకుల కృష్ణ బాపూజీ, ఆరెళ్లి వీర్రాఘవులు, పేరిశెట్టి అంబిక, పార్టీ నాయకులు తాడి రాజశేఖర్, సిద్ధి బాబ్జి, గడపా శివ, కాపగంటి కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ అరుణ


సామర్లకోటలో రోగులకు కిట్లు అందజేసిన చైర్‌పర్సన్ అరుణ, కమిషనర్ రామారావు

సామర్లకోట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక 13వ వార్డు అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద బుధవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఇందులో అన్నిరకాల వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. ఈ శిబిరంలో ఈసీజీ, నేత్ర పరీక్షలు, బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైద్యులు కె.విజయ పావనీ రమ్యప్రభ, భవ్యశ్రీ, కౌన్సిలర్లు నేతల హరిబాబు, వారా పాప, మున్సిపల్ ఏఎస్ఓ పెంకే శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు, హెల్త్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది శిబిరంలో సేవలందించారు. సుమారు 300 మందికి పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్లను వేటాడితే కఠిన చర్యలు


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మత్స్యకారులు సముద్రంలో ఆలివ్ రిడ్లే తాబేళ్లను వేటాడడం చట్టరీత్యా నేరమని మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ అన్నారు. మండలంలోని అమీనాబాదు హార్బర్‌లో బుధవారం ఆలివ్ రిడ్లే తాబేళ్ల వేట నిషేధంపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోప్ ఐలాండ్ పరిసర ప్రాంతాల్లోని సుమారు 5 కిలో మీటర్ల పరిధిలో వేట సాగించరాదన్నారు. ప్రస్తుతం ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీరప్రాంతంలోని ఇసుకలో గుడ్లుపెట్టి పొదిగే సమయమన్నారు. ఈ నెల రోజులూ హోప్ ఐలాండ్ పరిసరాల్లో వేట సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టిక్కెట్ లేకుండా ప్లాట్‌ఫాంపై ఉండటం నేరం


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న స్టేషన్ మేనేజర్, జీఆర్పీ ఎస్సై

సామర్లకోట: రైల్వే టిక్కెట్ లేకుండా ప్లాట్‌ఫాంపై ఉండడం నేరమని సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. బుధవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బందితో కలిసి ప్లాట్‌ఫారాలు, వెయింట్ హాళ్లను తనిఖీ చేశారు. టిక్కెట్ లేకుండా ప్లాట్‌ఫాంపై ఉన్న వారిని పోలీసుల సాయంతో బయటకు పంపించారు. ప్లాట్‌ఫాంపై ఉండాలంటే తప్పనిసరిగా ప్లాట్‌ఫాం టిక్కెట్ ఉండాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో టికెట్ లేకుండా పట్టుబడితే, రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. రైళ్లలో నిషేధిత వస్తువులను తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు చెప్పారు. రైళ్లలో సహ ప్రయాణికులు ఇచ్చే ఆహార పదార్థాలు తీసుకోరాదని తెలిపారు. మత్తు కలిపిన ఆహార పదార్థాలు ఇచ్చి, విలువైన వస్తువులను దొంగలించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా అనుమానితులు తారసపడితే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు ఏర్పాట్లు


తీరానికి స్వామిని తీసుకొస్తున్న దృశ్యం (ఫైల్)


భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ఉప్పాడ తీర ప్రాంతం

కొత్తపల్లి: మండలంలో ఉప్పాడ సాగరతీరంలో ఈ నెల 24న మాఘ పౌర్ణమి పుణ్యస్నానాలకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు వస్తారని అంచనా. శనివారం తెల్లవారుజామున పిఠాపురంలో వేంచేసిన కుంతీమాధవస్వామి(దొంగ దేవుడు)ని ఊరేగింపుగా తీరానికి తీసుకువస్తారు. స్వామివారి చక్రస్నానం అనంతరం భక్తులు పుణ్యస్నానాలను ఆచరించడం ఆనవాయితీ. అలాగే భక్తులు తమ పితృదేవతలకు కదళీ ఫలాలను సమర్పిస్తారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కాకినాడ రూరల్, పెద్దాపురం తదితర మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలను ఆచరిస్తారు. స్నానాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై స్వామినాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించనున్నట్టు తెలిపారు. తీరంలో పుణ్యస్నానాలు ఆచరించిన మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. అలాగే భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు రూరల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సూచించారు. మండలంలోని గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సైబర్ నేరాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా చదువుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యార్థి దశ నుంచే సన్మార్గంలో నడిచి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతిఒక్కరూ మంచి మార్కులను సాధించాలన్నారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై పవన్‌కుమార్, ఎంఈఓ రాజబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ సుబ్బలక్ష్మి, పాఠశాల పీఎంసీ చైర్మన్ బర్ల లోవరాజు, సీఆర్పీ రాంజీ ప్రసాద్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఐక్యతతో మెలగాలి

జగ్గంపేట: విద్యార్థులు ఐక్యతతో మెలగాలని స్థానిక సీఐ ఎస్.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని కాట్రావులపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులతో క్రమశిక్షణ కలిగి, ఎటువంటి కక్షలకు పోకుండా సద్భావనతో మెలగాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచి భవిష్యత్‌లో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థినులకు గుడ్–బ్యాడ్ టచ్‌లపై అవగాహన

గండేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు బుధవారం గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీసులు అవగాహన కల్పించారు. బాలికలు బ్యాడ్ టచ్‌ను ఎదుర్కొంటే తక్షణమే పాఠశాల ఉపాధ్యాయులకు గాని, తల్లితండ్రులకు గాని తెలియజేయాలని సూచించారు.

రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలి

జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు


తేటగుంట పామాయిల్ తోటలో అంతర పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

తుని రూరల్: ఉద్యాన పంటలను పోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి నేతల మల్లికార్జునరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కోటనందూరు, తుని, తొండంగి మండలాల్లో పని చేస్తున్న వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా హెచ్ఓ గుత్తుల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్, కొబ్బరి తోటల విస్తరణ, పునరుద్ధరణ, ఉద్యాన పంటల్లో అంతర పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఆయా పంటలకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతులకు తెలియజేయాలన్నారు. ఉద్యాన పంటల విస్తరణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ–క్రాప్ బుకింగ్ విధివిధానాలను వివరించారు. గ్రామాలవారీగా తోటల విస్తీర్ణాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తుని మండలం తేటగుంట, తొండంగి మండలం బెండపూడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయిల్‌పామ్, కొబ్బరి, అంతర పంటలను పరిశీలించారు. ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.